క్లుప్తంగా

నియామక పత్రాల అందజేత



వరికుంటపాడు: మండలంలో కొత్తగా ఎంపికైన గ్రామ వలంటీర్లకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆంద్రా బాలగురవారెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విరువూరు ఉప సర్పంచ్ పి.విజయ భాస్కరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి టీవీ బహూకరణ

సంగం: స్థానిక బీసీ బాలికల వసతి గృహానికి విశ్రాంత విద్యుత్‌శాఖ ఉద్యోగి గుత్తి సుబ్బారావు రూ.14 వేల విలువ చేసే టీవీని మంగళవారం బహూకరించారు. విద్యార్థుల అవసరాల కోసం హాస్టల్ వార్డెన్ మల్లీశ్వరమ్మ వినతి మేరకు స్పందించిన దాత గుత్తి సుబ్బారావు వెంటనే టీవీని అందించి అమర్చారు. ఈ సందర్భంగా దాతను సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ వసతి గృహాల అభివృద్ధి కోసం దాతలు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

ఆర్బీకేలో విజిలెన్స్ తనిఖీలు

సంగం: స్థానిక సచివాలయంలోని రైతుభరోసా కేంద్రంలో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అధికారులు అవినాష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి రైతుభరోసా కేంద్రంలో రికార్డులు పరిశీలించి ఈ–క్రాప్ నమోదు తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎరువుల పంపిణీకి సంబంధించి రికార్డులు తనిఖీ చేశారు. విజిలెన్స్ డీఈ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా రైతుభరోసా కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

చిత్రలేఖనంలో విద్యార్థిని ప్రతిభ



వెన్నెలను సత్కరిస్తున్న అధికారులు

అనుమసముద్రంపేట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని వెన్నెల చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చాటింది. వెన్నెల జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడంతో బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నెల్లూరులోని తిక్కన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెను ఘనంగా సన్మానించి రూ.5 వేల నగదు బహుమతితోపాటు ధ్రువీకరణ పత్రం, జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వెన్నెలను ఆ పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ హమీద్, చిత్రలేఖనం ఉపాధ్యాయుడు సుబ్బరాయుడు అభినందించారు.

ఆత్మకూరు ఆర్డీఓ విచారణ

ఆత్మకూరు: మర్రిపాడులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహబూబ్‌బాషా సోమవారం ఆత్మహత్యాయత్నం చేయగా, ఈ విషయంపై ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి మంగళవారం తన కార్యాలయంలో విచారణ చేపట్టారు. ప్రభుత్వ ఇచ్చిన తామే అనుభవిస్తున్నా రికార్డులను తారుమారు చేసిన వైనంపై స్థానిక రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని మహబూబ్‌బాషా ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాడు. అదేక్రమంలో డీసీపల్లిలోని దూదేకుల వర్గానికి కేటాయించిన శ్మశానవాటిక స్థలం వివాదాస్పదంగా మారుతోందని నూర్‌భాషా సంఘం నాయకులు తెలిపారు. స్పందించిన ఆర్డీఓ పూర్తిస్థాయిలో విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్య తీసుకుంటానన్నారు. అదే క్రమంలో మహబూబ్‌బాషాకు సంబంధించిన భూవివాదాన్ని పరిష్కరిస్తామన్నారు.కార్యక్రమంలో నూర్‌బాషా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖాదర్‌బాషా, సలీం, మాజీ కౌన్సిలర్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

- రూ.5 లక్షల ఆస్తి నష్టం



కాలిపోతున్న పొగాకు బ్యారన్

ఆత్మకూరురూరల్: మండలంలోని యర్రబల్లిలో ఉలవ ఖాజావలి అనే రైతుకు చెందిన పొగాకు బ్యారన్ మంగళవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ ఘటనలో క్యూరింగ్‌లో ఉన్న పొగాకుతో సహా బ్యారన్ సామగ్రితో కలిపి రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. తెల్లవారుజామున ఐదుగంటల ప్రాంతంలో బ్యారన్‌లో మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు వింజమూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే క్యూరింగ్‌లో ఉన్న పొగాకుతో సహా టైర్లు, గొట్టాలు, అల్లుడు కర్రలు, మొత్తం కాలిపోయాయి. పొగాకు బోర్డు అధికారులు ఆదుకోవాలని ఖాజావలి కోరుతున్నాడు.

బాలికల రక్షణపై అవగాహన అవసరం

- ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



కావలి: బాలికల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఆదిలక్ష్మి

కావలి: బాలికల హక్కులు, రక్షణ చట్టాలపై వారు అవగాహన కలిగి ఉండాలని ఒకటో పట్టణ ఎస్సై ఆదిలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మీ కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టడంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాలికల రక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తీసుకువచ్చిందని, దిశ యాప్ ద్వారా నిమిషాల వ్యవధిలోనే పోలీసులు నేర స్థలాన్ని గుర్తించి అప్రమత్తమై ఆపదలో ఉన్న మహిళలను, బాలికలను కాపాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దిలీప్, గౌరవాధ్యక్షుడు ఎం.మాలకొండారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు తనుజ, ఉపాధ్యాయులు వాణి, సుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

అల్లూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల(సుబ్బయ్య బడి)లో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.రాజేశ్వరి ఆధ్వర్యంలో బాలికల సంరక్షణపై అంగన్‌వాడీ చిన్నారులతో పాఠశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చెంచయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువు భవితకు వెలుగు

వరికుంటపాడు: బాలికల చదువు భవితకు వెలుగు అని ఎస్సై బాలమహేంద్రనాయక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన జరిగిన జాతీయ బాలికా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి

మర్రిపాడు: బాలికలు చదువులతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపల్ లక్ష్మీదేవి తెలిపారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను గౌరవించాలి

సంగం: ఆడపిల్లలను గౌరవించడం మన సంప్రదాయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సంగంలోని పలు పాఠశాలల్లో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆడబిడ్డను కాపాడుకుందాం అనే అంశంపై పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సంగం జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని వైష్ణవి జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి నెల్లూరులో కలెక్టర్ చక్రధర్‌బాబు చేతులమీదుగా రూ.3 వేల నగదు, జ్ఞాపిక అందుకోవడంతో ఆమెను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. చిత్రలేఖనం ఉపాధ్యాయుడు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదూరుపల్లి గురుకుల పాఠశాలలో..

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి గురుకుల పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై పలువురు వక్తలు విద్యార్థినులకు వివరించారు. దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, వై.సుబ్బరత్నమ్మ, కృష్ణవేణి, ప్రిన్సిపల్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అన్నింటా తానై..

ఆత్మకూరురూరల్: కుటుంబంలో అన్నింటా తానై వ్యవహరిస్తున్న మహిళల వారసులుగా నేటి బాలికలు భవిష్యత్‌కు పట్టుగొమ్మలని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు తోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని తరగతుల నుంచి ఉత్తమ మార్కులు, హాజరు, నడవడిక ప్రాతిపదికన బాలికలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ విద్యాలయంలో..

అనుమసముద్రంపేట: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ సుభద్ర బాలికల హక్కులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎస్సై నరేష్ మాట్లాడుతూ దిశ యాప్ గురించి వివరించారు. అనంతరం 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థినులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వెలగపాటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



మర్రిపాడు: కస్తూర్బా గాంధీ విద్యాలయంలో..



వరికుంటపాడు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై, హెచ్‌ఎం



అల్లూరు: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సంగం: విద్యార్థిని వైష్ణవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



అనుమసముద్రంపేట: విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న తహసీల్దార్



ఆత్మకూరురూరల్: బహుమతులు అందుకున్న విద్యార్థినులతో ఉపాధ్యాయులు



చేజర్ల: ఆదూరుపల్లి గురుకుల పాఠశాలలో..

ఎంఈఓకు సన్మానం

ఉదయగిరి: ఉదయగిరి మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తూ ఇటీవల ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ మస్తాన్ వలిని స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం పలువురు హెచ్‌ఎంలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్పీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

అల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అల్లూరు మండలంలో ఈ నెల 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగం, తయారీ, రవాణా, ప్రదర్శనలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ మంగళవారం తెలిపారు. ఇప్పటివరకు ప్రదర్శనలో ఉన్న ఫ్లెక్సీలను కూడా వెంటనే తొలగించాలని ఆదేశించారు. లేనిపక్షంలో అపరాధ రుసుము విధించి విచారణ చేపడతామని పేర్కొన్నారు.

లక్ష్యాలను నూరు శాతం సాధించాలి

వరికుంటపాడు: మండలంలోని వైద్య ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో వారికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తిచేయాలని మండల వైద్యాధికారిణి ఆయేషా సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆమె సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేటాయించిన సర్వేలను సమగ్ర సమాచారం చేపట్టి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు వారి పరిధిలోని గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేయించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల సర్వేను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ, సూపర్‌వైజర్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

కలిగిరి: స్థానిక గిరిజనకాలనీలో నివాసం ఉంటున్న వేటగిరి వెంకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో మంగళవారం పాలూరు మాలకొండారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి మృతుడి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.

సోమేశ్వరాలయ అభివృద్ధికి నిధుల మంజూరు

- ఎమ్మెల్యే మేకపాటి కృషి పట్ల హర్షం



మాట్లాడుతున్న నాయకులు

సోమశిల: సోమశిలలో ప్రాచీన సోమేశ్వరాలయం జీర్ణోద్ధరణకు ప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేసేందుకు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చేసిన కృషి పట్ల అనంతసాగరం జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో వచ్చిన వరదల వల్ల సోమేశ్వరాలయం రాజగోపురం, కల్యాణ మండపం, అమ్మవారి గర్భగుడి, నవగ్రహ మండపం ధ్వంసమయ్యాయని తెలిపారు. అప్పటి రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి ఆలయ పూర్వవైభవానికి చర్యలు తీసుకున్నారు. తదనంతరం ఆయన సోదరుడు, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి నిధుల కోసం కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వం దేవదాయశాఖ నిధుల నుంచి సీజీఎఫ్ ద్వారా రూ.కోటితోపాటు దాతల సహకారంతో మరో రూ.50 లక్షలు కలిపి రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణ, ఆలయ ధర్మకర్త ఉప్పల విజయ్‌కుమార్, పలువురు నాయకులు ఎమ్మెల్యే కృషి పట్ల హర్షం వ్యక్తం చేశారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి

ఉదయగిరి: పసుపు సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, శాస్త్రవేత్త తిరుపాల్‌రెడ్డి సూచించారు. పసుపు సాగుపై మంగళవారం మండలంలోని బండగానిపల్లి రైతుభరోసా కేంద్రంలో వారు రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పసుపు పంట సాగుచేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలన్నారు. తెగుళ్ల నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి షాహిల్, సర్పంచ్ లక్కు రమణమ్మ, సొసైటీ అధ్యక్షుడు కల్లూరి రమణారెడ్డి, ఎంపీటీసీ కాకు విజయమ్మ, రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య, వీఏఏలు చల్లా పూజిత, కనిష్క, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో చోరీలు

- పెరుమాళ్లపాడు నాగార్పమ్మ ఆలయంలో సుమారు రూ.2 లక్షల విలువ చేసే ఆభరణాలు, నగదు చోరీ

చేజర్ల: మండలంలోని పెరుమాళ్లపాడు గ్రామంలో ఉన్న నాగార్పమ్మ ఆలయంలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చేజర్ల పోలీసులు, గ్రామస్తుల వివరాల మేరకు గ్రామంలోని నాగార్పమ్మ ఆలయంలో అమ్మవారికి అలంకరించే 14 కాసుల దండ, తాళిబొట్లు దుండగులు అపహరించారు. సోమవారం ఆలయ అర్చకుడు శీనయ్య పనినిమిత్తం వెళ్లి అదేరోజు సాయంత్రం వచ్చి చూడగా గ్రిల్స్‌కు వేసిన తాళాన్ని పగులగొట్టి అమ్మవారి నగలు, హుండీని అపహరించిన విషయాన్ని గమనించారు. ఈ ఘటనపై గ్రామస్తులు మంగళవారం ఎస్సై మరిడినాయుడుకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అమ్మవారి ఆభరణాలు, హుండీలోని నగదు సుమారు రూ.2 లక్షల విలువ చేస్తాయని గ్రామస్తులు తెలిపారు.

మర్రిపాడులో..

సంగం: మండలంలోని మర్రిపాడులో మంగళవారం తెల్లవారుజామున ఒకేసారి మూడు ఆలయాల్లో చోరీ జరిగినట్లు సంగం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని ఎస్సీకాలనీలో మాతమ్మతల్లి, వెంకటేశ్వరస్వామి, వెంకయ్యస్వామి ఆలయాల్లో సోమవారం పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు ఆలయాలకు తాళాలు వేసి వెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయాల వద్దకు వెళ్లగా మాతమ్మతల్లి ఆలయం తలుపుల తాళాలు పగలగొట్టి ఉన్నాయి. అమ్మవారి మెడలోని తాళిబొట్టు, ముక్కు పుడక, హుండీలో నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. అలాగే వెంకటేశ్వరస్వామి ఆలయంలో సైతం తలుపులు తాళాలు పగలగొట్టి అమ్మవారి తాళిబొట్లు, వెండి గొలుసులు అపహరించారు. వెంకయ్యస్వామి ఆలయంలోనూ దుండగులు తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. ఎస్సై నాగార్జునరెడ్డి ఆలయాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కొలతల ప్రకారం పనులు చేపట్టాలి

ఉదయగిరి: మండలంలోని ఉపాధి కూలీలు క్షేత్రసహాయకులు, మేట్‌లు కేటాయించిన కొలతల ప్రకారం పనులు చేసుకుని ప్రభుత్వం నిర్దేశించిన గిట్టుబాటు కూలీ పొందాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. మంగళవారం పట్టణ సమీపంలోని చెక్‌డ్యాం వద్ద జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో 247 మంది కూలీలు పనులకు హాజరై ఉన్నారని, మండలంలో ఉపాధి పనులు చేసేందుకు రోజుకు 4 వేల మంది కూలీలు హాజరయ్యేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలిపారు. కూలీల హాజరు వివరాలను ఎంఎంఎస్ యాప్, ఈ–మస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట సాంకేతిక, క్షేత్ర సహాయకులు మురళి, హరి ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సోమశిల: అనంతసాగరంలో హజరత్ సయ్యద్ నా యూసఫ్ ఆలిషా ఖాదరి గంధ మహోత్సవం పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి, పీఠాధిపతులు మునీర్ ఆలీషా ఖాదరి, సజ్జాదనషీన్ జావీద్ ఆలిషా ఖాదరి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్గాలో జెండా నిషాని ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సర్పంచ్ బొర్రా శోభ, ఖాజావలి, మండల షబ్బీర్, గడ్డం రఫీ, ఫయాజ్, భక్తులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలను విస్తృత పరచాలి



తిమ్మారెడ్డిపల్లి సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న డీఎల్‌డీఓ పద్మజ

వరికుంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాల ద్వారా అందించే సేవలను ఉద్యోగులు విస్తృత పరచాలని కందుకూరు డీఎల్‌డీఓ పద్మజ తెలిపారు. మంగళవారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, వరికుంటపాడు, రామాపురం, తూర్పుబోయమడుగుల సచివాలయాలను, రామాపురం, బోగ్యం వారిపల్లెలోని ఆధార్ కేంద్రాలను ఆమె తనిఖీ చేసి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల ద్వారా అందించే సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యపరచాలన్నారు. ప్రతి రోజూ స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించి సకాలంలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కరరావు, ఈఓపీఆర్డీ సురేష్‌బాబు, జూనియర్ సహాయకుడు రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు హరి, శ్రీనివాసులు, పుష్ప పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల ఆటో పట్టివేత

మర్రిపాడు: మండలంలోని నెల్లూరు - ముంబై జాతీయ రహదారిపై బద్వేల్ వైపు నుంచి నెల్లూరు వైపు అక్రమంగా తరలిస్తున్న కోళ్ల వ్యర్థాలతో వెళుతున్న ట్రక్ ఆటోను మంగళవారం ఎస్సై విశ్వనాథరెడ్డి పట్టుకుని కేసు నమోదు చేశారు. బద్వేల్ ప్రాంతం నుంచి కోళ్ల వ్యర్థాలను అధికంగా చేపల గుంటల కోసం నెల్లూరు వైపు తరలిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాధ్యతగా పనిచేయాలి

జలదంకి: సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ ఎం.శ్రీధర్‌బాబు సూచించారు. మంగళవారం జలదంకి-1, 2 సచివాలయాలను ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులకు ఫేస్ రికగ్నైజేషన్ యాప్ గురించి పలు సూచనలు చేశారు. అనంతరం జలదంకిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం



ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీడీ, అధికారులు



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ శీనానాయక్

ఆత్మకూరు: జిల్లావ్యాప్తంగా జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నట్లు గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటదాసు తెలిపారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం, పమిడిపాడు లేఅవుట్లను హౌసింగ్ డీఈఈ పి.నటరాజ్, సచివాలయాల అమెనిటీస్‌లతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉగాది నాటికి రూఫ్ లెవల్‌కు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, వివిధ దశల్లో ఉన్న నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా హౌసింగ్, మున్సిపల్, సచివాలయాల ఉద్యోగులు సంయుక్తంగా కృషి చేయాలని సూచించారు. పేదలైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులు కొందరు కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో ఆ పనులను సైతం పీడీ పరిశీలించారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ బి.శరత్‌చంద్ర, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

వేగవంతం చేయండి

అల్లూరు: మండల పరిధిలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆర్డీఓ శీనానాయక్ సూచించారు. మంగళవారం స్థానిక టైలర్స్ కాలనీ లేఅవుట్‌ను, నార్త్ ఆములూరులోని జగనన్న లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఉగాది రోజున సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న లేఅవుట్లలో గృహప్రవేశాలు చేయించనున్నారని, ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేసి గృహప్రవేశాలు చేయించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మృదులత, తహసీల్దార్ శ్రీరామకృష్ణ, ఎంపీడీఓ శ్రీదేవి, కమిషనర్ ఫణికుమార్, హౌసింగ్ ఏఈ జమీల్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ నాగమణి

మర్రిపాడు: మండలంలోని భీమవరం సచివాలయ భవనాన్ని మంగళవారం ఎంపీడీఓ నాగమణి, సర్పంచ్ మందా చిన్నమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సచివాలయంతోపాటు రైతుభరోసా కేంద్రం కూడా రైతులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మందా రామరత్నారెడ్డి, ఆర్‌ఐ సురేంద్ర, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్బీకే, సచివాలయ భవన నిర్మాణాల పరిశీలన

ఆత్మకూరురూరల్: మండలంలో నిర్మాణంలో ఉన్న 9 సచివాలయాల భవనాల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని వెన్నవాడ, కరటంపాడు సచివాలయాల పరిధిలో సచివాలయాల భవనాలు, రైతుభరోసా కేంద్రాల నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిమలూరు, అప్పారావుపాళెంలలో ఆయా భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయని, చెర్లోయడవల్లిలో మంజూరైన భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. అనంతరం ఆయా సచివాలయాల్లో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వెన్నవాడ సర్పంచ్ జగన్నాథం లక్ష్మమ్మ, సచివాలయ కన్వీనర్ దిశించర్ల ప్రసాద్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శులు రేవూరు అంకయ్య, భాను, కృష్ణప్రసాద్, ఇంజినీరింగ్ సహాయకుడు రుచిత, మహిళా పోలీసు సునీత పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో శిథిలమైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ సమస్యల పరిష్కారానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జితేంద్రనాగ్‌రెడ్డి, సర్పంచ్ పి.చంద్రశేఖర్, విద్యుత్ ఏఈ వంగల్లు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 45 నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు సంబంధించిన పనులు ప్రారంభించారు.

సమీకృత దాణాతో పాల దిగుబడి

కలిగిరి: పాడి రైతులు పశువులకు సమీకృత దాణా అందించడం ద్వారా అధిక పాల దిగుబడి పొందవచ్చని పెద్దకొండూరు పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు తెలిపారు. ‘పశు విజ్ఞాన బడి’ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కృష్ణారెడ్డిపాళెం గ్రామ సచివాలయంలో పశుగ్రాసం పెంపకంపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పాడి రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1962కు సమాచారం ఇస్తే పశు అంబులెన్స్ వచ్చి పశువులకు వైద్యసేవలు అందిస్తుందని తెలిపారు. పశువైద్య సహాయకుడు రవీంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.